క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

దోమ: మండల పరిధిలోని గోడుగోనిపల్లి గ్రామానికి చెందిన మేకల అంజిలయ్య గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి స్థానిక బీఆర్ఎస్ నేతలతో బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు.. సద్దాం, మహేశ్ కుమార్, చిన్న నర్సింలు, జాలరి వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఏఈఓ నీరజ

మర్పల్లి: అర్హులందరూ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మర్పల్లి క్లస్టర్ ఏఈఓ నీరజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 16వరకు కొత్త పట్టా పాస్ పుస్తకం కలిగి ఉండి 18–59 సంవత్సరాలలోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో రైతుబీమా పథకంలో చేరిన వారు ఏవైనా మార్పులు–చేర్పులు ఉంటే క్లస్టర్ ఏఈఓలను సంప్రదించి మార్పులు–చేర్పులు చేసుకోవచ్చన్నారు. రైతుబీమా పథకంలో చేరిన రైతులకు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రభుత్వం బీమా కంపెనీ నుంచి రూ.5లక్షలు నామినీకి అందజేస్తారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గొడుగుల పంపిణీ



రాళ్లగుడుపల్లిలో గొడుగులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సావిత్రమ్మ

మోమిన్‌పేట: మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి సర్పంచు సావిత్రమ్మ గురువారం గ్రామస్తులకు 200 గొడుగులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో పొలాల పనికి వెళ్తున్న రైతులు, కూలీలు వర్షాలతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల కోఆర్డినేటరు అజీజ్, మండల పార్టీ అధ్యక్షుడు డి.వెంకట్, పీఏసీఎస్ చేర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాములు, నాయకులు బాలు తదితరులు ఉన్నారు.

ప్రహరీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని బీఆర్ఎస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ హసేన్ పటేల్ అన్నారు. మల్కాపూర్ గ్రామంలోని ఈద్గా, కబరస్థాన్‌కు రూ.15 లక్షల నిధులతో గురువారం ప్రహరీ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌలానా, పండరి, అబ్దుల్ మజీద్, మైనొద్దీన్, పండరి, తాజొద్దీన్, కరీంఖురేషీ, చందు ఉన్నారు.

బీఆర్ఎస్ పతనం ప్రారంభమైంది



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్, వైఎస్సార్‌టీపీ నాయకులు

నవాబుపేట: బీఆర్ఎస్ పార్టీ పతనం ప్రారంభమైందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్ అన్నారు. వైఎస్సార్ టీపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామ పంచాయతీ బీఆర్ఎస్ వార్డు సభ్యులు కుల్శీబేగం, పావని, అయిమత్ మహేశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్‌యాదవ్, చేవెళ్ల నియోజకవర్గ నాయకులు వసంతం, వెంకట్‌రెడ్డి, ఆనందం, శివకుమార్, మహేశ్, ఖైసర్, మహి ఉన్నారు.

బస్టాండ్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న భక్తులు

కొడంగల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కొడంగల్ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు ఉచిత భోజన వసతి కల్పించారు. సేవాభావంలో భాగంగానే అన్నదానం చేశామని సమితి సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయ్య, దశరథ్ తదితరులు తెలిపారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

- రైల్వే గేట్ల వద్ద వాహనదారులు, ప్రజల అవస్థలు
- అండర్ లేదా ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోనే సమస్యకు పరిష్కారం
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వేడుకోలు



పట్టణంలోని గంగారం వద్ద రైల్వే గేట్ వేయడంతో నిలిచిన వాహనాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం నుంచి గోధుమగూడ వెళ్లే దారిలో, రామయ్యగూడ రోడ్డులో, అనంతగిరిగుట్ట వెళ్లే మార్గాల్లో రైల్వేలైన్ ఉంది. ఈ దారుల్లో ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు రాకపోకల సమయంలో రైల్వే గేట్ పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ నుంచి బీదర్ వెళ్లే రైల్వే మార్గంలోనే 3గేట్లు ఉన్నాయి. ఈ లైన్ నుంచి తెల్లవారుజాము మొదలు అర్ధరాత్రి వరకు రైళ్లు వస్తూపోతుంటాయి. దాదాపు 20 వరకు రైళ్లు, గూడ్స్‌లు రాకపోకలు సాగిస్తాయి. గోధుమగూడ మార్గంలో గంగారం వద్ద గల రైల్వే గేట్ ఉండటంతో గోధుమగూడతో పాటు దాదాపు 10 గ్రామాల ప్రజలు వికారాబాద్‌కు రాకపోకలు చేస్తుండగా, అనంతగిరి గుట్ట ప్రధాన మార్గంలో ధారూరు, తాండూరు వెళ్లే వాహనాలు, రామయ్యగూడ రూట్‌లో 4 వార్డులతో పాటు 20 గ్రామాలకు పైగా ప్రజలు నిత్యం వికారాబాద్ పట్టణంలోకి వస్తుంటారు. రైళ్ల రాకపోకలతో గేట్ వేయడంతో నిత్యం ఉదయం పూట కళాశాల, పాఠశాల విద్యార్థులకు, ఉద్యోగులకు ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంటి నుంచి సరైన సమయంలో వెళ్లిన గేట్ పడిందంటే చాలు ఆలస్యం అవుతోందని, దీంతో నిర్ణీత సమయానికి వెళ్లలేకపోతున్నామని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు.

అనంతగిరిగుట్ట వెళ్లే మార్గంలోని గేట్ వద్ద మాత్రం ఒక్కోసారి వికారాబాద్ క్లబ్ వరకు సైతం వాహనాలు నిలిచిపోతుంటాయి. ఈ విషయంలో రైల్వే అండర్ బ్రిడ్జి లేదా ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే అందరికి సౌకర్యవంతంగా ఉంటుందని ఎన్నోమార్లు ఉన్నతాధికారులకు, రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతోందని వాహనదారులు, స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. అత్యవసర వాహనాలు సైతం చాలా సేపు ఆగిపోవాల్సి వస్తోంది. దీంతో ప్రమాదంలో ఉన్నవారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

గంగారం వద్ద రైల్వే గేట్ ఉండటంతో రాకపోకలకు పలుమార్లు ఇబ్బందిగా మారుతోంది. రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో గేట్ ఎక్కువ సార్లు పడుతోంది. దీంతో ఒక్కసారిగా ట్రాఫిక్ పెద్ద ఎత్తున జామ్ అవుతోంది. రాకపోకలకు ఆలస్యం అవుతోంది.

– ప్రసాద్, వికారాబాద్

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు మెటీరియల్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: మనసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి గురువారం క్రీడాకారులకు వాలీబాల్లు, నెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చౌడాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రామాంజనేయులు, కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు మాసయ్య, నాయకులు పురుశోత్తం, కృష్ణాజీ, రవీందర్, సంతోష్, నర్సింహ, అనిల్, మొగులయ్య, శివకుమార్, భాస్కర్, రాఘవేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న న్యాయవాదులు

కొడంగల్ రూరల్: న్యాయవాదులపై దాడులకు పాల్పడటం అమానుషమని కొడంగల్ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు బి.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి భాగ్యలత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోషియేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ చౌరస్తాలో బుధవారం న్యాయవాది శశికిరణ్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ప్రకాశ్‌రావు, వెంకట్‌రెడ్డి, పి.మధుసూదన్‌రెడ్డి, టి.రాములు, టి.కరుణాకర్‌రెడ్డి, ఏవీ.ఆనంద్, బస్వరాజు, వెంకటయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి, న్యాయవాదులు బి.కృష్ణయ్య, కె.రమేష్, కె.రాములు, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెరిచి ఉన్న ప్రమాదం!

- మ్యాన్ హోల్‌కు కప్పు వేయడంలో 'మున్సిపల్' నిర్లక్ష్యం
- ఆందోళన వ్యక్తంచేస్తున్న పట్టణవాసులు



ఎల్ఐజీలో రోడ్డులో నోరు తెరిచిన మ్యాన్‌హోల్

వికారాబాద్ అర్బన్: రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్ తెరిచి ఉండి, పది రోజులు గడుస్తున్నా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పట్టనవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని ఎల్ఐజీ బసంత్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లే రూట్‌లో మ్యాన్ హోల్ పైకప్పు పగిలి పోయింది. ఈ విషయం గమనించక చాలా మంది వాహనదారులు వేగంగా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో స్థానికులు మ్యాన్‌హోల్ వద్ద చెట్టు కొమ్మలు, ఒక రాయిని అడ్డుపెట్టి అప్రమత్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో ఈ విభాగాన్ని చూసే ఇన్‌చార్జ్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని గురువారం నేరుగా కమిషనర్ ముందే మిగతా అధికారులు సదరు ఇన్‌చార్జీ దృష్టికి తీసుకెళ్లగా సరేనని తలూపినా.. మళ్లీ యథావిధిగా నిర్లక్ష్యమే ప్రదర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

డిమాండ్ల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలని, రూ.19,500 కనీస వేతనాన్ని అమలు చేయాలని కోరారు. – సాక్షి, నెట్‌వర్క్



పరిగి: కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు



దౌల్తాబాద్: సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు



దోమ: సమ్మె చేస్తున్న కార్మికులకు భోజనం అందిస్తున్న కాంగ్రెస్ నేతలు



తాండూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మెట్లకుంటకు చెందిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన ఆర్థికసాయాన్ని గురువారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అందజేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పోతుల ఆనందం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. చికిత్స పొందుతున్నందున సీఎం ఆర్ఎఫ్ కింద రూ.2.50లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇందులో రాజీవ్‌కుమార్, బాధిత కుటుంబ సభ్యులున్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో నిర్వహిస్తున్న అమ్మవారి జాతరలో భాగంగా గురువారం ఎద్దుల బండి ఊరేగింపు నిర్వహించారు. చేనేత చీర, పసుపు, కుంకుమతో పాటు అమ్మవారికి నైవేద్యాలు తీసుకెళ్లారు. యువకులు, మహిళలు ఎంతో సంతోషంగా సంబరాల్లో మునిగితేలారు. ఈ కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచు నరేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు సుభాష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు పాల్గొన్నారు

పెద్దమ్మతల్లి రథోత్సవానికి తరలిరండి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘం నాయకులు

కొడంగల్ : పెద్దమ్మ తల్లి పలహారం బండి రథోత్సవానికి రావాలని ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి కుల బంధువులను ఆహ్వానించారు. ఆదివారం మధ్యాహ్నం తెలంగ్‌వాడీలోని ముదిరాజ్ భవనం నుంచి రథోత్సవం ప్రారంభమవుతుందని సంఘం నాయకులు నాయకులు బాల్‌రాజ్, నరేష్‌రాజ్, మాటూరు హన్మంతు, తలారి వెంకట్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీకి తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

కొడంగల్: బీసీల రాజకీయ ప్లీనరీను విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో ప్లీనరీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని పార్టీలు బీసీ ముఖ్యమంత్రితో పాటు బీసీలకు 60 ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో పదివేల మందితో బీసీ ప్లీనరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు వస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం నుంచి బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, చాకలి అశోక్, అశోక్ గౌడ్‌పాల్గొన్నారు.

16న పగిడియాలలో ఉచిత వైద్య శిబిరం

యాలాల: గీతా సత్సంగ్ సమితి తాండూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 16న మండల పరిధిలోని పగిడియాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలతో పాటు మందులు అందజేస్తారన్నారు. పగిడియాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు వేగిరం



ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం వేగంగా సాగుతోంది. గురువారం మొదటి దశ స్లాబ్ వేశారు. వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్రా యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పూజ చేశారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆలయానికి చేరుకొని పనులను పరిశీలించారు. కార్తీక మాసంలోపు భక్తులకు అందుబాటులోకి తేవాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, ఉమాపతి గౌడ్, కిషన్ ధాగా, టైలర్ శ్రీనివాస్, అచ్యుతారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్ తదతరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కు అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని కుల్కచర్ల మండల రైతుబంధు అధ్యక్షుడు రాజు, చౌడాపూర్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నర్సింలు అన్నారు. చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ పుల్లయ్య గత కొన్నిరోజుల క్రితం అనారోగ్య సమస్యతో ఆస్పత్రిపాలయ్యాడు. అనంతరం ఆర్థిక సాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.75 వేలు మంజూరయ్యాయి. గురువారం స్థానిక నేతలు బాధితుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శారదమ్మ, నాయకులు మఠం రాజశేఖర్, శివకుమార్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

మర్పల్లి: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండల పరిధిలోని బూచన్‌పల్లి, జాజుగుబ్బడి తండాకు చెందిన కొందరు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు చూసే బీఆర్ఎస్‌లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

కార్మికులకు శిక్షణ అభినందనీయం

పరిగి: భవన నిర్మాణ కార్మికులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ పద్మమ్మ అన్నారు. మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో జన్‌సహాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యాక్ తరఫున భవన నిర్మాణ కార్మికులకు 15రోజులుగా శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించడం కాకుండా ప్రతి రోజు మధ్యాహ్నం భోజన సదుపాయం పాటు రోజు రూ.300 ఇవ్వడం గొప్పవిషయమన్నారు. గ్రామంలో మరి కొంత మందికి శిక్షణ కావాలని అడుగుతున్నారని, వారికి కూడా అందించాలని కోరారు. శిక్షణ తరగతుల ద్వారా కార్మికుల్లో నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. పనిలో చాలా మార్పులు వస్తాయని ఎలాంటి పనిని ఎలా చేయాలో కూడా తెలుస్తాయన్నారు. ట్రైనింగ్‌లో నేర్చుకున్న నైపుణ్యాల ద్వారా వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల కోఆర్డినేటర్ రాజేందర్, జన్‌సాహస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్, ట్రైనర్ ప్రసాద్, యాదగిరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు



శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ తదితరులు

మరింత పకడ్బందీగా..

- ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌ల అందజేత
- మధ్యాహ్న భోజనం, విద్యార్థుల వివరాల నమోదుకు తప్పిన ఇబ్బందులు
- సిమ్‌ల కోసం హెచ్‌ఎంల ఎదురుచూపు

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే ప్రతీ వివరాలను ఆన్‌లైన్ చేస్తుంటారు. ఇందుకోసం మీ సేవా కేంద్రాలతో పాటు ఎమ్మార్సీ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఒక్కోసారి అసంపూర్తిగానే వివరాలు నమోదు చేసే పరిస్థితులు ఉంటాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం పాఠశాలలకు ఆధునిక పరికరాలను అందజేసింది. మండల వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 42 స్కూళ్లు ఉన్నాయి. ఇందులో సుమారు 80 మంది వరకు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయా పాఠశాలలల్లో వివరాలను ఆన్‌లైన్ చేయడానికి గతంలో మీసేవ కేంద్రాలు, ఎమ్మార్సీలకు వెళ్లేవారు. ఇలా అనేక ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. స్కూల్ హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేసింది. ఇందులో మధ్యాహ్న భోజనం, నమోదు, ప్రగతి నివేదిక, పరీక్ష ఫలితాలు, ఎస్ఎంసీతో పాటు పాఠశాలకు సంబంధించిన ప్రతీ వివరాలను నమోదు చేయవచ్చు.



అధికారుల నుంచి ట్యాబ్‌ను తీసుకుంటున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

అందని సిమ్ కార్డులు

వివరాలను ఆన్‌లైన్ చేయడానికి ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాలలకు ట్యాబ్‌లు అందించారు. ట్యాబ్‌లలో నమోదు చేయడానికి ఇంటర్నెట్ అవసరం. ఇందుకోసం ఒక్కో ట్యాబ్‌కు సిమ్ కార్డులు అందించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సిమ్‌కార్డులు ఇవ్వకపోవడంతో పలువురు హెచ్‌ఎంలు సెల్‌ఫోన్ల ద్వారా కనెక్ట్ చేసి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొంతమంది వినియోగించకుండానే పక్కన బెడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాబ్‌లకు సిమ్‌కార్డులు అందించాలని టీచర్లు కోరుతున్నారు.

వినియోగించేలా చర్యలు



ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే ట్యాబ్‌లు అందజేశాం. సిమ్‌కార్డులు త్వరలోనే వస్తాయి. ఆతర్వాత పూర్తి స్థాయిలో వీటిని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. ట్యాబ్‌లు అందజేయడంతో స్కూళ్ల వివరాలు పక్కాగా నమోదు చేసే వెసులుబాటు దక్కింది. ఉపాధ్యాయులకు సైతం ఇబ్బందులు తీరినట్లే.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్